నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | RANGAREDDY



ఇన్‌స్పైర్ నామినేషన్లలో ఉన్నత పాఠశాలలు వెనుకంజ

ఈ ఏడాది నామినేషన్ల లక్ష్యం 6,005.. ఇప్పటివరకు దాఖలైంది 1,722 మాత్రమే..

గడువు ఈ నెల 15కు పెంచినప్పటికీ ఫలితం శూన్యం

జిల్లాలో 1,201 పాఠశాలలకుగాను ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నది 239 పాఠశాలలే..

విద్యాశాఖ చొరవ చూపకపోవడమే కారణం !

# ఆవిష్కరణలపై అనాసక్తి !

రంగారెడ్డి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్ జిజ్ఞాసను పెంపొందించేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్‌పై రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలలు ఆసక్తి చూపడం లేదు. జూలై 1 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 15తో ముగిసింది. అయితే పాఠశాలల నుంచి ఆశించిన స్థాయిలో నామినేషన్లు రాకపోవడంతో గడువును అక్టోబర్ 15కు పెంచారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో పాఠశాలల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించాయి. ఉత్తమ ప్రదర్శనలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతోపాటు స్టార్టప్‌గా అవతరించే అవకాశం ఉన్నప్పటికీ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించకపోవడం.. విద్యాశాఖ ప్రత్యేక చొరవ చూపకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## స్టార్టప్‌లుగా అవతరించే చాన్స్..

కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట ఏటా అవార్డులను అందజేస్తున్నాయి. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు చొప్పున నామినేషన్లను స్వీకరిస్తారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలలు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఎంపికైన విద్యార్థి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు రూ.10వేల చొప్పున పారితోషికం అందిస్తారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. అక్కడ ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తుంది. ఈ స్థాయి ప్రాజెక్టులకు ప్రభుత్వం పేటెంట్ హక్కులను కల్పిస్తున్నది. జాతీయ స్థాయి పోటీలో రాణిస్తే రాష్ట్రపతి, ప్రధానమంత్రిని సైతం కలవొచ్చు. ప్రాజెక్టులకు వాస్తవిక రూపాన్నిచ్చి స్టార్టప్‌లుగా రూపొందించేందుకు సైతం ప్రోత్సాహం అందుతున్నది.

## చాలా పాఠశాలల నుంచి ఎంట్రీలే రాలే..

ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్‌ను నిర్వహిస్తుండగా.. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి నామినేషన్లు పేలవంగా వచ్చాయి. చాలా పాఠశాలల నుంచి ఎంట్రీలే రాలేదు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలికే ఈ కార్యక్రమంలో నామినేషన్లను వేసేందుకు ముందుకు రాకపోవడం అందరినీ విస్మయం గొలుపుతున్నది. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు ఇన్‌స్పైర్‌కు నామినేషన్లను సమర్పించడంలో నిర్లక్ష్యాన్ని కనబర్చాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు, కస్తూర్బా, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలలు కలిపి మొత్తం 1,201 పాఠశాలలు ఎస్సీఈఆర్టీలో నమోదై ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి పాఠశాలకు 5 చొప్పున మొత్తం 6,005 నామినేషన్లు రావాల్సి ఉంది. కానీ.. ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్లు కేవలం 1,722 మాత్రమే. ప్రైవేటు హైస్కూళ్లు జిల్లాలో 850 వరకు ఉండగా.. కేవలం 42 పాఠశాలలు మాత్రమే ఇన్‌స్పైర్‌కు నామినేషన్ వేశాయి. వినూత్న ఆలోచనలతో రాణిస్తున్న పాఠశాలల విద్యార్థులు జిల్లాలో చాలా మంది ఉన్నారు. గతంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ఎంతో మంది ప్రతిభను కనబర్చారు. ఈ ఏడాది సైతం జపాన్ వంటి దేశాల్లో నిర్వహించే ప్రదర్శనలకు జిల్లా నుంచి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఇన్‌స్పైర్ మనక్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

# మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలి

సీఎం రేవంత్ రెడ్డి

మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఫాక్స్‌కాన్ కంపెనీ సందర్శన..కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన సీఎం

అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని భరోసా

రంగారెడ్డి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ఫాక్స్‌కాన్ కంపెనీ ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి కంపెనీ ప్రతినిధులను కోరారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొంగర కలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతోపాటు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు. కంపెనీ పురోగతి, ఇతర అంశాలను కంపెనీ ప్రతినిధులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా.. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా అక్కడికక్కడే సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్ ఫాక్స్‌కాన్ ప్రతినిధులను కోరారు.

## బీఆర్ఎస్ హయాంలో బీజం..

ఐఫోన్ల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌కు బీఆర్ఎస్ హయాంలో బీజం పడింది. కంపెనీ తొలి దశ ఉత్పత్తులకు సంబంధించిన పనులు చివరి దశకు చేరాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులైన ఫాక్స్‌కాన్ ప్రతినిధులు రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లో రూ.4,600కోట్ల వ్యయంతో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. అప్పటి సీఎం కేసీఆర్‌తో కంపెనీ ప్రతినిధి బృందం సమావేశమయ్యాక పరిశ్రమ ఏర్పాటుకు సంసిద్ధతను తెలిపింది. మొదటి దశలో రూ.2,640కోట్లతో పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రారంభించేందుకు గత యేడాదే సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ మేరకు గత యేడాది మే 15న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు. ఈ మేరకు కంపెనీని త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు పనులు వేగవంతం చేశారు. ఉత్పత్తులకు సంబంధించి అన్ని రకాల పనులు ముగింపు దశకు వచ్చాయి. త్వరలోనే కంపెనీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ఫాక్స్‌కాన్ కంపెనీని సందర్శించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటైన ఈ కంపెనీ తొలి దశలోనే 35వేల మందికి ఉపాధి అవకాశాలను కల్పించనున్నది. ఉద్యోగాలు లేక నిరాశ నిస్పృహలో ఉన్న ఈ ప్రాంత నిరుద్యోగులకు ఫాక్స్‌కాన్ ఆశాదీపంలా నిలవనున్నది.



ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు

# రాడార్ స్టేషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

అదనపు కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జేఏసీ నాయకులు

ధారూరు, అక్టోబర్ 14 : పూడూరు మండల పరిధిలోని దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు గీత, ఆనంద్, మల్లేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయక్, వెంకటయ్య, నర్సింహులు, రాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వికారాబాద్ అదనపు కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి అందజేయాలని వినతి పత్రాన్ని సమర్పించారు.

దామగుండం అటవీ ప్రాంతం



# రాడార్ ఆపకుంటే.. రణరంగమే..

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తున్న దామగుండం పరిసర ప్రాంతాల ప్రజలు

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటున్న దామగుండం పరిరక్షణ జేఏసీ
- ఈసీ, మూసీ నదులకు ప్రమాదమంటున్న పర్యావరణ వేత్తలు
- 'నేవీ రాడార్' ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయడంపై స్థానికుల ఆగ్రహం
- కోర్టుకు వెళ్లి స్టే తెస్తామంటున్న పరిరక్షణ సమితి
- లక్షల చెట్ల నరికి వేతపై స్థానికుల ఆందోళన
- రేడియేషన్ ప్రభావం ప్రజల్లో భయం.. భయం..
- ఇప్పటికే ఊరూరా పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్న ప్రజలు
- ప్రాజెక్టు ఆపేదాకా పోరాడుతామంటున్న స్థానికులు

## రాడార్‌ను విరమించుకోకుంటే ఊరుకోం..



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు వల్ల రేడియేషన్‌తో రాబోయే తరాలకు అన్యాయమే. వాతావరణం కలుషితమై వ్యాధులొస్తాయని మేధావులు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. అమెరికా వంటి దేశంలో రాడార్‌ను తొలగించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకొప్పుకున్నది. రాడార్ నిర్ణయాన్ని విరమించుకోకుంటే ఊరుకునేది లేదు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం.

– చాకలి బుచ్చయ్య, పూడూరు గ్రామం

## కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది..



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల బాగోగులను ఆలోచించి రాడార్ ఏర్పాటుకు ఒప్పుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు వచ్చాయి. పూడూరు, తిర్మలాపూర్, గూడుపల్లి, టేకులబిడ్ తండా, సోమన్‌గుర్తి తదితర గ్రామాల ప్రజలు ఈ అడవిలో మేకలు, పశువులను మేపుకొంటూ జీవనం కొనసాగిస్తాం. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు రద్దు కోసం తెగించి కొట్లాడుతాం.

– సీహెచ్ పాండు, పూడూరు గ్రామం

ఒక పక్క స్థానికుల నిరసనలు.. మరో పక్క పర్యావరణ వేత్తల హెచ్చరికలు.. అయినా కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి మారలేదు.. ఎవ్వరి అభిప్రాయాలు పట్టించుకోకుండా దామగుండంలో నేవీ రాడార్ ప్రాజెక్టుకు మంగళ వారం శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. లక్షల చెట్లు నరికివేస్తారని, అడవి నామరూపాలు లేకుండా పోనున్నదని స్థానికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రేడియేషన్ ప్రభావంపై భయపడుతున్నా సమాధానమిచ్చేవారే లేరు. ఈ ప్రాజెక్టు వల్ల ఈసీ, మూసీ నదులు ఉనికి కోల్పోతాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వానికి పట్టింపులేదు. పదేండ్ల క్రితమే రాడార్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది.. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం 2900 ఎకరాల అటవీ భూములను నేవీకి అప్పగించింది.. ఈ భూముల్లో లక్షా 93 వేల చెట్లతోపాటు 400 ఎకరాల్లో గడ్డి భూములు ఉన్నాయి. వీటితోపాటు 500 ఏండ్లనాటి దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయం. లక్షల కోట్ల విలువైన ఔషధ మొక్కలు, 258 రకాల పక్షిజాతులు ఉన్నాయి. రక్షణశాఖ అవసరాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ అడవిని నరికివేసి ప్రకృతి విధ్వంసం చేయడాన్ని తాము నిరసిస్తున్నామని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కోర్టుకు వెళ్లి అడ్డుకుని తీరుతామని 'సేవ్ దామగుండం' పేరిట ఉద్యమం చేస్తున్న దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ సభ్యులు తెలిపారు. తమ ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోతే అనేక రూపాల్లో నిరసనలు ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ)




నేవీ రాడార్ స్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు



దామగుండంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ కోనేరు

## అడవిని నరికి మా పొట్ట కొట్టొద్దు..



చుట్టుపక్కల గ్రామాలకు ఉపాధిని కల్పించే అడవిని నరికి మా పొట్టకొట్టొద్దు. నేవీ రాడార్ స్టేషన్ మాకొద్దు.. బరాబర్ కొట్లాడుతాం. ఈ ప్రాంతాన్ని కలుషితం చేసి మా ప్రాణాలమీదకు తీసుకొస్తరా.. కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకిచ్చింది. ప్రజలను పట్టించుకోరా.. ఎంతో పురాతనమైన దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయం ఏమి కావాలె. లక్షల చెట్లను నరికివేసి మమ్మల్ని రోగాలపాలుజేస్తరా.

– రాంచంద్రయ్య, పూడూరు గ్రామం

## నేవీ రాడార్ వద్దే వద్దు..



రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో నేవీ రాడార్ నిర్మాణం వద్దే వద్దు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై చింత లేదు. రోగాలబారిన పడితే ఎలా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు తీస్తాయా..? నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు. ప్రభుత్వాలు పునరాలోచన చేయాలి.

– పీ సతీశ్ పంతులు, పూడూరు గ్రామం

# పర్యావరణానికి పెను ముప్పు

దామగుండం వీఎల్ఎఫ్ ప్రాజెక్టుపై రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

- అడవులను నాశనం చేస్తే మనుగడ అసాధ్యం
- ఈ ప్రాజెక్టుతో ప్రధాని, సీఎం బంధం బయటపడింది
- రాహుల్ గాంధీ స్పందించాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 14 : పూడూరు మండలంలోని దామగుండంలో భారతీయ నావికా విభాగం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ ప్రాజెక్టు వల్ల మానవ మనుగడే అసాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు సంపత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాడార్ ప్రాజెక్టు వల్ల ప్రజలు, పర్యావరణానికి జరిగే నష్టాలు, ప్రకృతి వైపరీత్యాలపై వక్తలు మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ఇప్పటికే భద్రాచలంలో నవగ్రహ ఆలయం, పర్ణశాల మునిగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. యావత్ ప్రజానీకానికి, పర్యావరణానికి నష్టం చేకూర్చే వీఎల్ఎఫ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని విరమించుకోవాలన్నారు. ఒక చెట్టుకు పది మొక్కలు నాటుతామని చెబుతున్నా..అది సాధ్యం కాదన్నారు. ప్రాజెక్టు పేరుతో సహజ వనరులను దెబ్బతిస్తున్నారని, ఇందులో పాలకులు మతలబు వేరే ఉంటుందన్నారు. దామగుండం నిర్మాణం జరిగితే ప్రజలే మునిగిపోతారని తెలిపారు

## సముద్ర తీరాలను ఎంచుకోవాలి..

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బాబూరావు మాట్లాడుతూ దామగుండం ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ఉన్న అడవులను నాశనం చేసుకుంటూ పోతే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ ప్రాజెక్టులో స్థానికులకు ఎలా ఉద్యోగాలు వస్తాయని ప్రశ్నించారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రాజెక్టులకు సముద్ర తీరాలను ఎంచుకోవాలని, కానీ ప్రజల మధ్య ప్రాజెక్టును నిర్మిస్తామనడం సరికాదన్నారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ దామగుండంలో 2,900 ఎకరాల్లో అనేక ఔషధ మొక్కలు ఉన్నాయని, అక్కడ దేవాలయానికి సంబంధించిన 1,400 ఎకరాల భూమిని ఇప్పటికే కోల్పోయారని, ఈ ఆలయంలోని గుండంలో 8.5 పీహెచ్ కలిగిన నీరు ఉందని, అందులో ఔషధ గుణాలున్నాయన్నారు. అడవి పోతే మరో అడవిని తయారు చేస్తామంటున్నారని, అడవి అనేది సహజంగా ఏర్పడుతుందని, కృత్రిమంగా తయారు చేస్తే అది జీవ వైవిధ్యాన్ని తిరిగి తెచ్చిపెట్టలేదని, ప్రపంచమంతా ఈ విషయం తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని చెట్లు పెరగని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించుకోవాలన్నారు.

## ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదు..

తెలంగాణ విఠల్ మాట్లాడుతూ ప్రజల మధ్య, ప్రకృతివనంలో రాడార్ స్టేషన్ నిర్మించాలనుకుంటే అక్కడ గ్రామ సభలు, డిబేట్లు ఎందుకు నిర్వహించలేదని, ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారని, అలాంటప్పుడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం రాడార్ స్టేషన్‌ను ఎందుకు నిర్మిస్తున్నదని ప్రశ్నించారు. బడాబాబులకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి బంధం బయటపడిందన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందించాలన్నారు. క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి రుచిత్ మాట్లాడుతూ గత ఐదేండ్ల నుంచి దామగుండాన్ని పరిశీలిస్తున్నామని, 12 లక్షల మొక్కలు తొలగించడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, అయితే ఫారెస్టు అధికారుల వద్ద సరైన డాటా కూడా లేదని, ఎన్ని లక్షల చెట్లు తొలగిస్తున్నారో ఆన్‌లైన్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ ఒక్క చెట్టును నరకడం లేదంటే, ఫారెస్టు అధికారులు మాత్రం ఒక లక్ష చెట్లు అని అంటున్నారన్నారు. ఈ అడవికి బదులు 17 లక్షల మొక్కలు నాటుతామని చెబుతున్నారని, అది ఫెయిల్యూర్ ప్రక్రియ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్టు తులసీ చందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి